సాక్షి
అనంతపురం
సోమవారం । 23 । జూన్ । 2025



ప్రతి గొర్రెకూ ఓ ధర
యాడికి మండలంలో టీడీపీ నాయకులు నయా దందా సాగిస్తున్నారు. కానుల కక్కుర్తితో దోపిడీకి పాల్పడుతున్నారు. 8లో



ఆర్డీటీని కాపాడుకుందాం
ఉమ్మడి జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్డీటీని కాపాడుకుందామని సీనియర్ క్రికెటర్లు పిలుపునిచ్చారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.7°/24.8°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

అంతులేని దగా



అధికారం కోసం యువతకు అలవిగాని హామీలు గుప్పించారు. లేనిపోని ఆశలు కల్పించారు. అయితే, సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయినా ఒక్క హామీ అమలు చేయకుండా కుచ్చుటోపీ పెట్టారు. ఈ క్రమంలో యువతకు బాసటగా, చంద్రబాబు ప్రభుత్వ కపటత్వాన్ని నిరసిస్తూ, హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'కు పిలుపునిచ్చింది.



యువతకు చంద్రబాబు అండ్ కో మోసం
- ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ హామీ హుళక్కి
- కానరాని 'ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ. 3 వేల భృతి'
- ఫీజు బకాయిలు చెల్లించని వైనం
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- 'కూటమి' కపటత్వాన్ని నిరసిస్తూ నేడు వైఎస్సార్ సీపీ 'యువత పోరు'

జిల్లాలో 2019-20 నుంచి 2023-24 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఇలా		
విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	105.43
2023-24	40,006	28.08

వసతి దీవెన:		
విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45491	42.37
2020-21	50,571	47.96
2021-22	50,702	45.25
2022-23	42,915	37.46
2023-24	40,006	00.00

అనంతపురం: 'యువతకు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం... ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తాం..' అంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో యువతను మభ్య పెట్టిన చంద్రబాబు అండ్ కో.. నేడు ఆ ఊసే ఎత్తడం లేదు. పథకాలకు పేర్లు మార్చారే కానీ అమలు సంగతే మర్చిపోయారు. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనూ తొలగించి రోడ్డుపాలు చేస్తున్నారు. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారు. ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు 'వసతి దీవెన' అందించకపోవడంతో అప్పు భారం పడి ఆందోళన చెందుతున్నారు.

ఫీజు కడితేనే సర్టిఫికెట్లు..
చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారు. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 'వసతి దీవెన' నిధులు గతేడాది జూన్‌లో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ సర్కారు వచ్చి ఉంటే డబ్బులు తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యేవి. కానీ, కూటమి అధికారంలోకి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధుల విడుదలను నిలిపివేసింది.

పాత బకాయిలూ ఇచ్చిన ఘనత జగన్‌దే..
పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ చిత్తశుద్ధితో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. ప్రతి త్రైమాసికానికి ముందే నిధులు విడుదల చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఖాతాల్లోకి ఫీజు మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. పైగా రాజకీయాలకు అతీతంగా 2017–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం చెల్లించి పెద్ద మనసు చాటుకున్నారు.

గతమెంతో ఘనం..
యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారి ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కింది. జిల్లాలో 18 వేల సచివాలయ ఉద్యోగాలు, ప్రభుత్వ శాఖల్లో 8 వేల ఉద్యోగాల భర్తీతో పాటు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి ఊరట కల్పించారు.

స్పష్టత ఇవ్వాలి



నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అమలు చేయాలి. ఈ పథకంపై తక్షణమే స్పష్టత ఇవ్వాలి. ఎంతో మంది నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏడాది గడుస్తున్నా పథకం ఊసే ఎత్తడం లేదు. భృతి భ్రాంతిగానే మిగిలిపోయింది.
– తరిమెల గిరి, ఎల్ఎల్ఎం, అనంతపురం

మేనిఫెస్టో అమలు చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. నిరుద్యోగ భృతిపై వెంటనే విధివిధానాలు విడుదల చేయాలి. ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ. 3 వేల చొప్పున అందజేయాలి.
– కే. అశ్విని, బీఎస్సీ, అనంతపురం

నేడు వైఎస్సార్‌సీపీ యువత పోరు
యువత పక్షాన నిలుస్తూ సోమవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' ధర్నా నిర్వహిస్తోంది. యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అర్జీలో ఆధార్, ఫోన్ నంబర్లు పొందుపరచాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలని సూచించారు.

టీబీ డ్యాం @ 45 టీఎంసీలు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం నీటితో కళకళలాడుతోంది. డ్యాం మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి 45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 30,594 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాంలో గతేడాది ఇదే సమయానికి 1,582.11 అడుగుల వద్ద 5.580 టీఎంసీల నీరు నిల్వ ఉండింది. 638 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,966 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్
- జేసీ, ఆర్‌డీఓలు కూడా..

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఆర్‌డీఓలు కూడా వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహిస్తున్న 'తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు వీరందరూ వెళ్లినట్లు తెలిసింది. తిరిగి ఈనెల 24న విధులకు హాజరవుతారని కలెక్టర్ కార్యాలయ అధికారవర్గాలు తెలిపాయి.

కామన్ తేదీ వేసేలా చర్యలు తీసుకోండి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా పాఠశాల సహాయకులకు (హిందీ, తెలుగు) ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిలీవింగ్ తేదీ కామన్‌గా వేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగు, హిందీ సహాయకులు తప్ప తక్కిన అందరు 8న రిలీవ్ అయి 9న కొత్త స్కూళ్లలో చేరారన్నారు. పీడీలు 14న రిలీవ్ అయి 15న చేరారన్నారు. తెలుగు, హిందీ టీచర్లు మాత్రం 15న రిలీవ్ అయి 16న చేరాలంటూ మౌఖిక ఆదేశాలు ఇచ్చారన్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేనికారణంగా భవిష్యత్తులో నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. హిందీ,తెలుగు టీచర్లను కూడా 8న రిలీవ్ చేసి 9న కొత్త స్కూళ్లలో చేరినట్లు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఆర్‌యూపీపీ జిల్లా గౌరవాధ్యక్షులు సి.ఎర్రిస్వామి, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.హనుమేష్, జి.తులశిరెడ్డి ఉన్నారు.

అర్చకుడిపై బూతులతో రెచ్చిపోయిన ఈఓ

పుట్లూరు: మండలంలోని చింతకుంట ఆలయ అర్చకుడు సూర్యప్రకాష్‌మూర్తిపై దేవదాయ శాఖ ఈఓ మురళీకృష్ణ బూతులతో రెచ్చిపోయారు. ఆలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి సూర్యప్రకాష్ మూర్తి తీసుకెళ్లారు. ఈ విషయం గిట్టని ఈఓ మురళీకృష్ణ అసభ్య పదజాలంతో అర్చకుడిపై మండిపడ్డారు. 'సార్.. నేను మీపై ఫిర్యాదు చేయలేదు. సమస్య పరిష్కరించాలని కోరా' అంటూ అర్చకుడు సర్ది చెప్పినా వినకుండా ఫోన్ కట్ చేయడం గమనార్హం. ఈ ఆడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈఓ తీరుపై అర్చకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మా బాధలు పట్టించుకోరా?

- బదిలీల ఖాళీలపై ఎంటీఎస్ టీచర్ల రగడ
- 80 శాతానికి పైగా కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఉన్నాయంటూ ఆవేదన
- సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ అడ్డగింత.. బాయ్‌కాట్



అనంతపురంలో సైన్స్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: తమ బాధలు పట్టని ప్రభుత్వం పొమ్మనలేక పొగ పెడుతోందంటూ ఎంటీఎస్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 594 మంది ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్నారు. వీరికి బదిలీ కౌన్సెలింగ్‌లో భాగంగా 693 ఖాళీలు చూపించారు. వీటిలో 80 శాతం దాకా జిల్లా సరిహద్దు (కర్ణాటక రాష్ట్రం బార్డరు) మండలాల్లోనే ఉన్నాయి. ఆదివారం ఉదయం 9 గంటలకే జిల్లా సైన్స్ సెంటర్‌కు బదిలీల కౌన్సెలింగ్ కోసం ఎంటీఎస్ టీచర్లు చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఖాళీల సమాచారం తెలుసుకుని తీవ్ర ఆవేదనతో ఆందోళనకు దిగారు. మెజార్టీ ఖాళీలు గుడిబండ, డీ.హీరేహాళ్, అమరాపురం, అగళి, బొమ్మనహాళ్, బ్రహ్మసముద్రం, కంబదూరు, రాయదుర్గం, శెట్టూరు, కణేకల్లు మండలాల్లో చూపించారని వాపోయారు. తక్కిన మండలాల్లో 1,2,3 పోస్టులు మాత్రమే చూపించారన్నారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ సౌలభ్యం కూడా ఉండదని, అలాంటి తమను అంతంత దూరం పంపితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు చాలామంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం తమకు 'నియర్ బై రెసిడెంట్' ఉత్తర్వులిస్తే... ఈ ప్రభుత్వం 'లాంగ్ బై రెసిడెంట్' ఉత్తర్వులు ఇస్తోందంటూ మండిపడ్డారు.

డీఈఓను అడ్డగింత..
కౌన్సెలింగ్ కేంద్రానికి వచ్చిన డీఈఓ ప్రసాద్ బాబును ఎంటీఎస్ టీచర్లు అడ్డుకున్నారు. కార్పొరేషన్, అన్ని మునిసిపాలిటీలతో పాటు ఏకోపాధ్యాయుడు ఉండే స్కూళ్లను ఖాళీగా చూపించాలని పట్టుబట్టారు. తన పరిధిలో లేదని, రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ చెప్పినా వినలేదు. ఆందోళన చేస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. పైనుంచి ఏవైనా ఆదేశాలు వస్తే ఆమేరకు ముందుకెళ్తామన్నారు. అయితే, రాత్రి 7 గంటల సమయానికి కూడా స్పష్టత రాకపోవడంతో బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి ఎంటీఎస్ టీచర్లు వెళ్లిపోయారు. ఎంటీఎస్ టీచర్లకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, గోపాల్, వెంకటరమణ, ఏపీటీఎఫ్ నాయకులు వెంకటేష్, సిరాజుద్దీన్, నరసింహులు, నాగరాజు, తదితరులు మద్దతు తెలిపారు.

ఓ సంఘం నాయకులపై తిరగబడ్డ ఎంటీఎస్ టీచర్లు
ఓ సంఘం నాయకులు సైన్స్ సెంటర్‌కు చేరుకుని అధికారుల మెప్పు పొందేందుకు ఎంటీఎస్ టీచర్లను బెదిరించే ధోరణిలో మాట్లాడారు. 'మీ పోస్టులు చట్టబద్ధం కావు. అనవసరంగా ఇబ్బంది పడతారు. మీరడుగుతున్నట్లు అన్ని ఖాళీలు చూపించడం వీలుకాదు. సజావుగా కౌన్సెలింగ్ జరిగేందుకు సహకరించండి' అంటూ మాట్లాడగా అప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న టీచర్లు తిరగబడ్డారు. మా బాధలు అర్థం కావడం లేదా.. అని మండిపడ్డారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, వయసుపైబడి రిటైర్‌మెంట్‌కు చాలామంది దగ్గరలో ఉన్నారని, అలాంటి వారు ఎలా వెళ్తారో తెలీదా అని నిలదీయడంతో ఆ సంఘం నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు.

మారమన్నందుకు మట్టుబెట్టాడు!

- కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కొట్టి చంపిన భర్త
- తొలుత మిస్సింగ్ కింద పోలీసులకు ఫిర్యాదు
- ముళ్లపొదల్లో లభ్యమైన మృతదేహం



కళావతి (ఫైల్)

కనగానపల్లి: వ్యసనాలు మాని కుటుంబపోషణపై దృష్టి సారించాలని హితవు పలికినందుకు కట్టుకునే భార్యనే ఓ కసాయి కడతేర్చిన ఘటన కనగానపల్లి మండలంలో సంచలనం రేకెత్తించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రం కనగానపల్లికి చెందిన బోయ రాఘవ, కళావతి (32) దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో ఏడాదిగా రాఘవ మద్యానికి బానిసగా మారి ఇతర వ్యసనాలనూ అలవర్చుకున్నాడు. దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు చోటుచేసుకునేవి.

కట్టెల కోసమని వెళ్లి...
శనివారం సాయంత్రం కట్టెల కోసమని గ్రామ శివారులోని ముళ్ల పొదల్లోకి కళావతితో పాటు రాఘవ వెళ్లాడు. ఆ సమయంలో వ్యసనాలు మానుకోవాలని మరోసారి రాఘవకు భార్య హితవు పలికింది. దీంతో ఆమెతో వాగ్వాదానికి దిగి కొడవలితో దాడి చేశాడు. కుప్పకూలిన భార్య తలపై కట్టెతో బాదడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను అక్కడే వదిలేసి ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత ఆమె ప్రాణాలు వదిలింది.

మొదట మిస్సింగ్ కింద ఫిర్యాదు
చీకటి పడుతున్నా కుమార్తె ఇంటికి రాకపోవడంతో కళావతి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. కుటుంబ సభ్యులతో కలసి ఆమె కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆ సమయంలో వారితో పాటు రాఘవ కూడా ఉన్నాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా కళావతి కోసం గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ముళ్ల పొదల వైపుగా వెళ్లిన స్థానికులు అక్కడ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. కళావతి మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రామగిరి సీఐ శ్రీధర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాఘవ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులో తీసుకుని విచారణ చేయడంతో తానే హతమార్చినట్లు అంగీకరించినట్లు సమాచారం.



సంఘటనా స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

అనుబంధం.. అధ్వానం!

- వ్యవసాయ అనుబంధ రంగాలకు గడ్డుకాలం
- నానా కష్టాలు పడుతున్న ఉద్యాన, పాడి రైతులు
- పట్టించుకునే నాథుడు కరువు

అనంతపురం అగ్రికల్చర్: ''వ్యవసాయం దండగమారి... ఉచిత విద్యుత్ అమలు చేస్తే తీగలపై బట్టలు ఆరేసుకుంటారు... ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఇస్తూపోతే పరిహారం కోసమైనా చస్తారు... పావలా వడ్డీ వేస్ట్... రాయితీలు ఇవ్వకూడదు'' అంటూ వ్యవసాయ రంగాన్ని, రైతులను ఒకప్పుడు హేళన చేసిన చంద్రబాబు.. ఇంకా తన తీరు మార్చుకోనట్లే కనిపిస్తోంది. గత ఎన్నికల ముందు 'సూపర్‌సిక్స్', 'అన్నదాత సుఖీభవ' అంటూ మభ్యపెట్టి మరోసారి అధికారంలోకి వచ్చినా.... పాత బాణీ మరచిపోకుండా రైతులను దగా చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయినా ఎటువంటి సాయం చేయకుండా వ్యవసాయ రంగంతో పాటు అనుబంధ రంగాలైన పట్టు, పాడి, పశుపోషణ, ఉద్యాన తదితర రంగాలపై ఆధారపడిన రైతులను కూడా నష్టాల బాట పట్టించారు.

మూగ వేదన..
పట్టుపరిశ్రమశాఖ ద్వారా మల్బరీ (రేషం) రైతులకు ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, బడ్జెట్ ఇవ్వకపోవడంతో మల్బరీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. మల్బరీ రైతులు ఇతర పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. ఇక పాడి రైతులకు ఎంతో మేలు చేస్తున్న 'అమూల్ పాల వెల్లువ'ను నిలిపివేయడంతో హెరిటేజ్ లాంటి ప్రైవేట్ డెయిరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పాల ధరలు పెంచాల్సింది పోయి లీటర్‌పై రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గించేయడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. పశుపోషణకు ఎలాంటి పథకాలు అమలు చేయలేదు. కంటి తుడుపుగా గడ్డి విత్తనాలు, పశుదాణా, గడ్డి కత్తిరించే యంత్రాలు ఇచ్చారు. పశుబీమా లేకపోవడంతో పాడి రైతులు, జీవాల కాపర్లు నష్టపోతున్నారు. ఏడాది కాలంలోనే జిల్లా వ్యాప్తంగా 500 వరకు పశువులు, గేదెలు, 2,500 వరకు జీవాలు మృత్యువాత పడినట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత బీమా పథకం అమలు చేయడంతో పశువులు, జీవాలు చనిపోయినప్పుడు 8 వేల మంది లబ్ధిదారులకు రూ.26 కోట్ల మేర బీమా కింద పరిహారం దక్కింది. దేశంలో మరెక్కడా లేని విధంగా 108 మాదిరిగా 1962 హెల్ప్‌లైన్ ద్వారా మారుమూల పల్లె ప్రాంతాలకు వెళ్లి ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలనే ఆశయంతో ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటు చేసిన మొబైల్ అంబులెన్స్‌లు నేడు మూగవేదన అనుభవిస్తున్నాయి.



ఇటీవల పుట్లూరు మండలంలో గాలివానకు దెబ్బతిన్న అరటి తోట (ఫైల్)

నష్టాల్లో ఉద్యాన రైతులు..
రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 72 రకాల తోటలు, ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల ఫల సాయంతో ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీగా, ఉద్యాన హబ్‌గా పేరుగాంచిన అనంతపురం జిల్లాలో ఇటీవల కాలంలో వ్యవసాయ పంటలను తగ్గించేసి పండ్లు, కూరగాయలు తదితర ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఐదేళ్ల రాయితీలు, గిట్టుబాటు ధరలతో ఆర్థికంగా గట్టెక్కించారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో కూడా అప్పటి ప్రభుత్వం వెన్నంటి నిలవడంతో ఉద్యాన రైతులు మనోధైర్యంతో ముందడుగు వేశారు. ఉచిత పంటల బీమా కింద ఉద్యాన పంటలకు కూడా పెద్ద మొత్తంలో బీమా పరిహారం ఇవ్వడంతో వెసులుబాటు దక్కింది. అయితే చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేశారు. 5 శాతం ప్రీమియం కట్టాల్సిందేనని నిబంధనలు పెట్టారు. చీనీ, అరటి, ద్రాక్ష, టమాట తదితర ప్రధాన ఉద్యాన ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించక భారీ నష్టాలు చవిచూస్తున్నారు. ప్రధానంగా 92 వేల ఎకరాల ద్వారా పండిన 5.20 లక్షల మెట్రిక్ టన్నుల చీనీ చేదెక్కడంతో భారీ నష్టాలు చవిచూస్తున్నారు. ఉద్యాన పంటల సాగు పెరుగుతున్నా అందుకు తగ్గట్లు రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వడంలో కూటమి సర్కారు విఫలమైంది. గతేడాది 42,100 హెక్టార్ల టార్గెట్ ఇవ్వడంతో దాదాపు 50 వేల మంది వరకు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు వస్తాయని ఆశించినా... చివరకు 18 వేల హెక్టార్లకు మంజూరు చేశారు. ఆ రైతులకూ పూర్తి స్థాయిలో పరికరాలు అందివ్వడంలో విఫలం కావడం గమనార్హం. ఇంకా 2 వేల మంది వరకు రైతులు పరికరాల కోసం ఎదురు చూస్తున్న దుస్థితి నెలకొంది.

బాలికకు వివాహయత్నం.. అడ్డుకున్న అధికారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీలో ఆదివారం ఓ బాలికకు వివాహం చేస్తున్నారనే విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడికెళ్లి అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలుచుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ పుల్లయ్య మాట్లాడుతూ... మైనారిటీ తీరకనే పిల్లలకు పెళ్లి చేయాలని చూస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ స్వరూప్, ఏఎన్‌ఎం అంజినమ్మ, సచివాలయ మహిళా పోలీస్ చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, ఆశా వర్కర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చీనీ చెట్లు దగ్ధం


కాలిపోయిన చీనీ చెట్లు

కూడేరు: మండలంలోని ఇప్పేరు గ్రామానికి చెందిన రైతు ఎస్.దస్తగిరి సాగు చేసిన చీనీ తోటలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి తోటను చుట్టుముట్టాయి. దీంతో 8 ఏళ్ల వయసున్న 80 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు, మోటారు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య ఉందని పలుమార్లు ట్రాన్స్ కో అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదని, నష్టానికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమని ఈ సందర్భంగా బాధిత రైతు వాపోయాడు. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

కొట్టుకున్న టీడీపీ కార్యకర్తలు

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్తల మధ్యన ఘర్షణ చోటు చేసుకుని ఒకరినొకరు కొట్టుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు.. టీడీపీ కార్యకర్త శంకర్ గ్రామంలోని ఆలయం వద్ద ఆదివారం మద్యం సేవిస్తుండగా అటుగా వెళ్తున్న మరో టీడీపీ కార్యకర్త శ్రీకాంత్‌రెడ్డి గమనించి పక్కకు వెళ్లి తాగాలని హితవు పలికాడు. ఆ సమయంలో శ్రీకాంత్‌రెడ్డితో శంకర్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. అనంతరం ఇద్దరూ కనగానపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒంటరి జీవితాన్ని తాళలేక వృద్ధురాలి బలవన్మరణం

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన తిమ్మక్క (68) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు పెళ్లి కాలేదు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో ఒంటరి జీవితాన్ని తాళలేక మనోవేదనకు లోనైన ఆమె గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం దూకి బలవన్మరణానికి పాల్పడింది. అటుగా వెళ్లిన వారు బావిలో తేలుతున్న మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని వెలికి తీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి గొర్రెకూ ఓ ధర!

- టీడీపీ నేతల నయా దందా
- సంతలో నుంచి గొర్రె బయటకు పోతే రూ.20 చెల్లించాలి
- ప్రతి సోమవారం అప్పనంగా రూ.50వేలకు పైగా అక్రమ వసూళ్లు


కోన రోడ్డులోని సంతలో గొర్రెలను విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్)

యాడికి: ఉమ్మడి జిల్లాలో ఉరవకొండ, కదిరి తర్వాత మేకలు, గొర్రెల సంతకు యాడికి ఖ్యాతి గాంచింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ సంతకు తెలంగాణ, కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో వ్యాపారులు వస్తుంటారు. ఏడాది క్రితం వరకూ ఇక్కడ వ్యాపార లావాదేవీలు సక్రమంగా సాగుతూ వచ్చాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధనార్జనే ధ్యేయంగా కొందరు టీడీపీ నేతలు అక్రమ వసూళ్లకు తెరలేపారు. సంత నుంచి గొర్రె కానీ, మేక కాని బయటకు తీసుకెళితే రూ.20 చెల్లించుకోవాలి. ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

మార్కెట్ యార్డుకు రూ.24 లక్షల ఆదాయం

యాడికి నుంచి వేములపాడుకు వెళ్లే మార్గంలో ఉన్న వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో గతంలో ప్రతి సోమవారం గొర్రెల సంత నిర్వహించేవారు. పెద్ద సంఖ్యలో వాహనాల్లో గొర్రెలు, మేకలను తీసుకొచ్చి క్రయవిక్రయాలు సాగించేవారు. ప్రతి సోమవారం 1,500 నుంచి 2,500 వరకూ జీవాలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అప్పట్లో తాడిపత్రి మార్కెట్ యార్డుకు చెందిన సిబ్బంది నిర్ణీత రుసుం వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసేవారు. ఇలా గొర్రెల సంత ద్వారా ప్రతి సోమవారం రూ.40 వేలకు పైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరేది. ఈ లెక్కన నెలకు రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా, ఏడాదికి రూ.24 లక్షల వరకూ మార్కెట్ ఫీజులు వసూళ్లయ్యేవి. ఇక పండుగల సందర్భంలో ఈ ఆదాయం రెట్టింపు స్థాయిలో ఉండేది.

ధనార్జనే ధ్యేంగా...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత గొర్రెల సంత ఆదాయంపై స్థానిక టీడీపీ నేత కన్ను పడింది. ఈ నేపథ్యంలో మరికొందరితో కుమ్మక్కై 4 నెలలుగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ క్రమంలో తమ దందాకు అనుకూలంగా ఉండేలా కుట్రలు పన్ని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులోని గొర్రెల సంతను యాడికి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోన రోడ్డుకు మార్చేలా చేశారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి మార్కెట్ యార్డు ఆదాయానికి భారీగా గండి కొట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గొర్రెలు, మేకలు విక్రయించిన వారి నుంచే నిర్ణీత రుసుం వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా జీవాలు విక్రయించిన వారితో పాటు కొనుగోలు చేసిన వారి నుంచి కూడా రూ.20 వసూలు చేస్తున్నారు. చెల్లించకపోతే జీవాలను గేటు దాటనివ్వకుండా దౌర్జన్యాలకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇదే విషయాన్ని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి దృష్టికి వ్యవసాయ మార్కెట్ అధికారులు తీసుకెళ్లారు. ఏటా గొర్రెల సంత ద్వారా మార్కెట్ యార్డుకు సమకూరుతున్న రూ.24 లక్షల ఆదాయానికి కొందరు టీడీపీ నేతలు గండి కొడుతున్నారని, ఈ అక్రమాలను అరికట్టాలని అభ్యర్థించినట్లు విశ్వసనీయ సమాచారం. అయినా దీనిపై ఎలాంటి చర్యలూ లేవు. మార్కెట్ యార్డు నుంచి బయటపడిన తర్వాత గొర్రెల సంతపై ఆదాయం స్థానిక పంచాయతీకి చెందాల్సి ఉంది. అయినా పంచాయతీకి నయాపైసా ఆదాయం సమకూరడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతంలో మాదిరిగానే గొర్రెల సంతను వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డుకు తరలించి, ఆదాయం ప్రభుత్వానికే సమకూరేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గతంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న గొర్రెల సంత (ఫైల్)

ఆర్డీటీని కాపాడుకుందాం



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెటర్లు

అనంతపురం: ఐదున్నర దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో విశిష్ట సేవలు అందించిన ఆర్డీటీని కాపాడుకుందామని సీనియర్ క్రికెటర్లు పిలుపునిచ్చారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ క్రికెటర్లు ఆర్డీటీ పరిరక్షణకు ఆదివారం కదం తొక్కారు. పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టిన రంజీ క్రీడాకారులు, మాజీ క్రీడాకారులు, మహిళా క్రికెటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ' సేవ్ ఆర్డీటీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద ప్రారంభమైన కలెక్టర్ ఆఫీస్ వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డీటీకి అన్ని విధాలుగా క్రికెటర్లు తోడుగా ఉంటాం. ఆర్డీటీ సేవలు కొనసాగేలా సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ సేవలు అగితే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు భారీగా నష్టపోతారన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు, క్రీడాకారులకు చేయూత, పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు దన్నుగా నిలుస్తున్న ఆర్డీటీ సేవలు కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున, సభాధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం వెంటనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ చేసే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఐపీఎల్ క్రీడాకారుడు విజయకుమార్, ఏడీసీఏ జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, షాబుద్దీన్, ప్రసాదరెడ్డి, రంజీ క్రికెటర్లు సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు శ్రీనివాసులు, కమలాకర్‌నాయుడు, సీతారామారావు, రవీంద్రనాథ్, చంద్రమోహన్‌రెడ్డి, రంజీ మాజీ క్రికెటర్లు ఫయాజ్, షాషా వలి, మురళి, సర్దార్, సాగర్, విజయ్‌రాజు, దాదా ఖలందర్, సాదిక్, రంజీ క్రికెటర్లు వినయ్‌కుమార్, మచ్చా దత్తారెడ్డి, కోగటం హనీష్ వీరారెడ్డి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ చట్రంలో 'రెవెన్యూ'

- వివాదాలు పరిష్కరించరు.. విజ్ఞప్తులకు స్పందించరు
- అన్నిస్థాయిల అధికారులపై అలవిగాని పెత్తనం
- ప్రజాప్రతినిధుల సిఫారసులకే పెద్దపీట


కలెక్టరేట్ కార్యాలయం

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగాన్ని శాసించే రెవెన్యూ శాఖ అధికార పార్టీకి దాసోహమంటూ పూర్తిగా రాజకీయ చట్రంలో బందీగా మారింది. ఈ శాఖలోని అన్నిస్థాయిల అధికారులపై మితిమీరిన రాజకీయ పెత్తనం స్పష్టంగా కనిపిస్తోంది. వివాదాల పరిష్కారం ఊసే ఉండదు. విజ్ఞప్తులకూ స్పందించరు. కేవలం ప్రజాప్రతినిధుల సిఫారసులకు మాత్రమే రెవెన్యూ అధికారులు పెద్దపీట వేస్తున్నారు. ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల ప్రక్రియనే ఇందుకు నిదర్శనం.

సిఫారసులకు వెంపర్లాట..

తహసీల్దారు అంటే మండల స్థాయి మెజిస్ట్రేట్. ఇంతటి హోదాలో ఉంటూ తాత్కాలిక లబ్ధి కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయించి కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్ వేయించుకుంటున్నారు. ఈ తీరే వారి అస్తిత్వాన్ని కోల్పోయేలా చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు అధికారులను పావులుగా వాడుకుంటూ వారిచేత చట్టవిరుద్ధంగా తమకు కావాల్సిన పనులను చేయించుకుంటున్నారు.

దాసోహమంటూ..

ప్రజాప్రతినిధుల సిఫారసులతో పోస్టింగ్ పొందిన అధికారులు ఒక రకంగా వారికి దాసోహమై పని చేయాల్సి వస్తోంది. వారు చెప్పినట్లుగా నిబంధనలకు విరుద్ధంగా తప్పులు చేయక తప్పడం లేదు. ప్రధానంగా భూముల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకులు చెప్పినట్లుగా చట్ట విరుద్ధంగా నడుచుకోవాల్సి వస్తోంది. 2014–19 మధ్యకాలంలో జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు తహసీల్దారులు కొండ గుట్టలను, ప్రభుత్వ భూములను, వాగులు, వంకల స్థలాలను టీడీపీ నాయకుల అనుచరులకు కట్టబెట్టి... అందుకు సస్పెన్షన్ అనే మూల్యం చెల్లించుకున్నారు. ఇప్పటికే ఓ తహసీల్దారుకు పెన్షన్‌లో కోత పడింది.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్..

ప్రజాప్రతినిధులు సిఫారసు, అండతో పోస్టింగ్ పొందిన వారు ఉన్నతాధికారుల ఆదేశాలనూ బేఖాతర్ చేస్తున్నారు. బదిలీ చేస్తే ప్రజాప్రతినిధులతో ఫోన్ చేయించి కోరిన స్థానానికి రీ–ఆర్డర్ తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు సైతం ప్రజాప్రతినిధుల సిఫారసులకు తలొగ్గుతున్నారు. ఇటీవల కొందరు తహసీల్దార్ల బదిలీల ప్రక్రియలో ఈ తంతు ఓ ప్రహసనంలా మారింది. పావులా వాడుకున్న వారు నష్టం జరిగినప్పుడు కనీసంగానూ పట్టించుకోవడం లేదని ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడిన పలువురు వాపోతున్నారు.

రోటావేటర్‌లో పడి విద్యార్థి దుర్మరణం


ప్రేమ్‌కైలాష్ (ఫైల్)

రొద్దం: ప్రమాదవశాత్తు రోటావేటర్‌లో పడి ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం రాగిమేకులపల్లికి చెందిన నరసింహులు కుమారుడు ప్రేమ్‌కైలాష్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి పట్టునే ఉన్న బాలుడు.. ఓ రైతు పొలాన్ని విత్తుకు సిద్ధం చేసేందుకు వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్‌తో కలసి వెళ్లాడు. పొలంలో ట్రాక్టర్‌కు రోటావేటర్ అమర్చుకుని డ్రైవర్ పొలాన్ని కలియబెడుతుండగా దానిపై కూర్చొని ఉన్న ప్రేమ్‌కైలాష్ పట్టు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో రోటావేటర్ ముందుకు సాగడంతో అందులో చిక్కుకున్నాడు. డ్రైవర్ గమనించి ట్రాక్టర్ ఆపేలోపు ప్రాణాలు కోల్పోయాడు. వెలికి తీసేందుకు వీలు లేనంతగా చిన్నారి శరీరం అందులో చిక్కుకుపోయింది. మొండెం నుంచి తల వేరుపడింది. కుమారుడు మృతితో నరసింహులున అలివేలమ్మ దంపతులు బోరున విలపించారు.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి పరామర్శించి, ఓదర్చారు.

ఆలయంలో అర్చకత్వంపై రగడ


ఆలయంలోనే ఘర్షణకు దిగిన అర్చకులు, వారి కుటుంబ సభ్యులు

రాయదుర్గం టౌన్: స్థానిక కోటలో వెలసిన పురాతన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ అర్చకత్వంపై అర్చకులు రెండు వర్గాలుగా విడిపోయి ఆలయంలోనే ఆదివారం ఘర్షణకు దిగారు. శ్రీవారి సన్నిధిలోనే అర్చకులు, వారి బంధువులు కొట్టుకునే స్థాయిలో గొడవపడ్డారు. వివరాలు... ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో 14 ఏళ్లుగా అర్చకుడు నరసింహమూర్తి, ఆయన కుటుంబసభ్యులే అర్చకత్వం నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీవైష్ణవులే అర్చకత్వం వహించాలని పలువురు భక్తుల డిమాండ్ మేరకు నరసింహమూర్తిని తొలగించి దేవాదాయశాఖ అధికారులు 8 నెలల క్రితం బాల మురళీకృష్ణకు అర్చకత్వ బాధ్యతలను అప్పగించారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టును నరసింహమూర్తి ఆశ్రయించారు. తాజాగా కోర్టు ఉత్తర్వులు నరసింహమూర్తికి అనుకూలంగా రావడంతో ఆయనక అర్చకత్వం బాధ్యతలను ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి అప్పగించారు. విషయం తెలియగానే ప్రస్తుత అర్చకులు, వారి బంధువులు ఆలయానికి తరలి వచ్చి గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. కొందరు ప్రముఖులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించే ప్రయత్నం చేశారు. కోర్టు ఉత్తర్వు మేరకు తనకు న్యాయం చేయాలని నరసింహమూర్తి డిమాండ్ చేస్తుండగా, వారసత్వంగా వస్తున్న సంప్రదాయం మేరకు అర్చకత్వాన్ని తామే నిర్వహించాలని ప్రస్తుత అర్చకులు బాల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మరో వైపు శ్రీవారి ఆలయంలో శాస్త్ర ప్రకారం శ్రీవైష్ణవులే పూజారులుగా కొనసాగించాలని కొందరు పట్టుబట్టారు. ఈ విషయమై ఈఓ నరసింహారెడ్డిని వివరణ కోరగా కోర్టు ఉత్తర్వుల మేరకు తాము నడుచుకుంటూ నరసింహమూర్తికి తాళాలు అప్పగించామని స్పష్టం చేశారు.

కలెక్టరేట్ వద్ద నేడు ధర్నాలు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న 'యువత పోరు' పేరుతో ధర్నా నిర్వహించనున్నారు. అలాగే మునిసిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికుల ధర్నా, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి


మృతురాలు లావణ్య

ఉరవకొండ రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వన్నూరుస్వామి తన కుటుంబంతో కలసి శనివారం పెన్నహోబిలం క్షేత్ర దర్శనానికి వచ్చారు. రాత్రికి అక్కడే బస చేసిన వారు.. ఆదివారం ఉదయం పూజాదికాలు ముగించుకున్న అనంతరం ఆటోలో తిరుగు ప్రయాణ మయ్యారు. క్షేత్ర సమీపంలోనే ఆమిద్యాల మార్గంలో డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఒక్కసారిగా ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న లావణ్య (18)కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఉరవకొండలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఇదే ఘటనలో లావణ్య కుటుంబసభ్యులు ఆరుగురు గాయపడ్డారు. ఘటనపై ఎస్‌ఐ జనర్ధననాయుడు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లుగా పేర్కొన్నారు.

ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరు

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్


మాట్లాడుతున్న జాఫర్

తాడిపత్రి రూరల్: ప్రజా ఉద్యమాలను అడ్డుకోవడం ఎవరితరం కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. తాడిపత్రిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సీపీఐ పట్టణ 3వ మహా సభలు జరిగాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో జాఫర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల సాధనకు ఎన్ని ఉద్యమాలైనా చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాల కోసం ఇచ్చిన హామీని నిలుపుకోలేకపోయిందన్నారు. ఈ క్రమంలో హామీల సాధనకు కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రజా ఉద్యమానికి విశేష స్పందన లభించిందన్నారు. అప్పట్లో చేపట్టిన ప్రజా ఉద్యమాన్ని నీరు గార్చేందుకు కూటమి నేతలు అడ్డంకులు సృష్టించినా ఫలితం లేకపోయిందన్నారు. మహాసభలకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, తాడిపత్రి నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడో సారి పట్టణ కార్యదర్శిగా చిరంజీవి..

మహాసభల్లో తాడిపత్రి పట్టణ సీపీఐ కమిటీని ఎన్నుకున్నారు. మూడో సారి కూడా చిరంజీవినే పట్టణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా నాగేంద్ర శ్రీరాములును ఎంపిక చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఏడుకొండలు

ధర్మవరం అర్బన్: భార్య మద్యం తాగొద్దన్నందుకు మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. పట్టణంలోని గీతానగర్‌కు చెందిన బేల్దారి పనిచేసే ఏడుకొండలు మద్యం తాగే అలవాటు ఉంది. తాగుడు మానేయాలని భార్య పావని చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం శ్మశాన వాటిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మలి వయసులో ఆసరా

- 60 ఏళ్లు, అంతకుపైబడి వయసున్న వారికి సీనియర్ సిటిజన్ కార్డు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- జిల్లా కేంద్రాల్లోనే పొందే అవకాశం



అనంతపురం అర్బన్: సీనియర్ సిటిజన్ కార్డు ఒక్కటి ఉంటే చాటు ప్రభుత్వం నుంచి లభించే చాలా ప్రయోజనాలు అందుతాయి. 60 ఏళ్లు, ఆపై వయసున్న వారు సీనియర్ సిటిజన్ కార్డు పొందేందుకు అర్హులు. కార్డు తీసుకున్నవారికి ఆర్థిక, వైద్య, ప్రయాణ, పన్ను మినహాయింపు వంటి పలు ప్రయోజనాలు చేకూరుతాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అధిక వడ్డీ రేట్లు ఉంటాయి. బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వరంగ టెలికాం సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ప్లాన్‌లు ఇస్తాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ డిజిటల్ సేవల్లో సీనియర్ సిటిజన్ కార్డుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

ప్రయాణంలో రాయితీ

- రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరపై తగ్గింపు ఉంటుంది
- ఐఆర్‌సీటీసీ లేదా టికెట్ బుక్కింగ్ సమయంలో రాయితీ వర్తిస్తుంది.
- విమాన ప్రయాణాల్లోనూ కొన్నిసార్లు రాయితీలు ఉంటాయి.
- బస్సు పాసు తీసుకుంటే నెలవారీ ప్రయోజనాలు ఎక్కువగా లభిస్తాయి.

ఆరోగ్య బీమా, వైద్య రాయితీ

- ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి.
- వైద్య పరీక్షలు, చికిత్సలపై ఆస్పత్రుల్లో రాయితీలు లభిస్తాయి.
- ఔషధాల మీద కొన్ని ఫార్మసీల్లో తగ్గింపు లభిస్తుంది.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రాధాన్యతగా వైద్యం అందిస్తారు.
- ఈఎస్ఐసీ, సీజీహెచ్ఎస్ పథకాల్లో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు ఉంటాయి.
- తలసేమియా, క్యాన్సర్, వైద్య రీయింబర్స్‌మెంట్ స్కీముల్లో అర్హత.

పన్ను మినహాయింపు

- ఆదాయ పన్నులో ప్రత్యేక మినహాయింపు ఉంటుంది.
- 2025–26లో రూ.3 లక్షల వరకు ఆదాయానికి పన్నులు చెల్లించనవసరం లేదు.
- 80డి కింద ఆరోగ్య బీమా ప్రీమియంపై అధిక మినహాయింపు ఉంటుంది.
- 80టీటీబీ కింద ఎఫ్‌డీల మీద వడ్డీ ఆదాయానికి రూ.50 వేల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది.
- ఫారం 15 హెచ్ ద్వారా టీడీఎస్ మినహాయింపు పొందవచ్చు.
- పన్ను ఫైలింగ్‌ను సులభతరం చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఉంటాయి.

దరఖాస్తు ఇలా

- రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ సిటిజన్ పోర్టల్ లేదా సర్కారీ సువిధ (https://sarkarisuvidha. online/) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఆమోదం పొందిన తరువాత సీనియర్ సిటిజన్ కార్డును ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు.
- సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) లేదా నగర, పురపాలక సంఘం కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



- దరఖాస్తు ఫారం, రెండు ఫొటోలు, చిరునామా, వయసు రుజువు పత్రాలను అధికారులకు అందించాలి.

అవసరమైన పత్రాలు..

- ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేదా పాన్ కార్డ్
- జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ లేదా పాన్‌కార్డ్
- విద్యుత్ బిల్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ
- ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు
- బ్యాంక్ పాస్‌బుక్
- ఆరోగ్య పత్ర ఏబీహెచ్‌ఏ కార్డు, హెల్త్ ఐడీ.

క్లుప్తంగా

'ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం'



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ముందు ఇంజినీరింగ్ విభాగంలోని నీటి సరఫరా సిబ్బంది చేపట్టిన సమ్మె ఆదివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెకు ఓపీడీఆర్, ఏబీడీ యూసీ నాయకులు రజాక్, ఉపేంద్ర కుమార్, తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, కుళ్లాయప్ప, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి శెట్టి సేవలు అభినందనీయం



డీఐపీఆర్ఓ గురుస్వామి శెట్టి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: గురుస్వామిశెట్టి సేవలు అభినందనీయమని పలువురు యోగా గురువులు కొనియాడారు. అనంత డీఐపీఆర్ఓగా పని చేస్తూ తిరుపతికి బదిలీ అయిన గురుస్వామి శెట్టికి ఆదివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద యోగకేంద్రం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ యోగా మైదానంలో జరిగిన సమావేశంలో వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు రాజశేఖ రరెడ్డి , డాక్టర్ శ్రీనివాస్, దివాకర్, డాక్టర్ లక్ష్మీ నారాయణ మాట్లాడారు. సహజంగా సంప్రదాయ యోగా, సంస్కృతి సంప్రదాయాలపై మంచి భావన ఉన్న గురుస్వామి సహకారం మరవలేమన్నారు. అనంతరం గురుస్వామి శెట్టి దంపతులను ఘనంగా సత్కరించారు.

'యవత పోరు'కు తరలిరండి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో జరిగే యువత పోరు నిరసన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం మోసపూరితమైన హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పుట్టపర్తిలో జరిగే యువత పోరుకు మండలం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కన్వీనర్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో రొట్టెల పండుగ



దర్గా వద్ద భక్తుల సందడి

అనంతపురం కల్చరల్: మనిషి విశ్వాసానికి మించిన ఆధ్యాత్మిక శక్తి లేదని మతపెద్ద సజ్జద్ షేక్ సయ్యద్ నూర్ బాషా ఖాద్రీ అన్నారు. నగర శివారులోని మహాదేవ నగర్ ఆస్థాన-ఏ-ఆషిఖానే ఖాదిరి చమన్ దర్గాలో ఆదివారం రొట్టెల పండుగ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు విద్యుద్దీపాలతో అలంకరించిన దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా మతపెద్ద సజ్జద్ షేక్ సయ్యద్ నూర్ బాషా ఖాద్రీ రొట్టెల పండుగ విశిష్టతను వివరించారు. వేలాది మందికి అన్నదానం చేశారు. అనంతరం పీర్ మహమ్మద్ వలీషా ఖాద్రి గంధం మహోత్సవం, ఖవ్వాలీ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో నిర్వాహకులు ఫయాజ్ ఖాద్రి, ఖాజా, మహబూబ్ బాషా, సిరాజ్, చిష్టి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష రాహుకేతు హోమాలు చేపట్టారు. అలాగే మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

నగర పాలన సాగేదెలా?

- పాలకవర్గంతో మాట్లాడినందుకు ఒక టీపీఎస్ ప్రభుత్వానికి సరెండర్?
- మెటర్నిటీ సెలవులో మరో టీపీఎస్
- నగరంలో యథేచ్ఛగా భవనాల అతిక్రమణలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి దిక్కే లేకుండా పోయింది. అందుబాటులో ఉన్న ఒక్క అధికారి మాత్రమే ఏమీ చేయకుండా ఏసీ గదికి పరిమితమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ టీపీఎస్ మెటర్నిటీ సెలవులో వెళితే.. పాలకవర్గ సభ్యులతో మాట్లాడుతోందని మరో టీపీఎస్‌ను కూటమి ప్రభుత్వం ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో సదరు టీపీఎస్ సెలవులో వెళ్లిపోయారు. ఈ నాలుగేళ్ల పాటు ఒకే అధికారిని ఉంచి కూటమి ప్రభుత్వం కనుసన్నల్లోనే అనధికార నిర్మాణాలు చేపట్టేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమైనట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఇక మిగతా ప్రాంతాల్లో పరిస్థితేంటో చెప్పాల్సిన అవసరం లేదు.

అనధికార నిర్మాణాలు.. అడ్డగోలు ఫ్లెక్సీలు

- నగరంలోని అరవింద నగర్‌లో నిర్మిస్తున్న రెండు భవనాలకు సెల్లార్ అనుమతి లేదు. మొదట్లో సెల్లార్ నిర్మించడం లేదని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారుల నుంచి వకాల్తా పుచ్చుకున్నారు. ఇప్పుడు బహుళ అంతస్తులతో సెల్లార్‌తో నిర్మాణం చేపడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేసి ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.
- కమలా నగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్ సమీపంలో, ఆదిమూర్తి నగర్‌లో ఉపాధ్యాయ భవన్ ముందు, కోర్టు రోడ్డులో గాస్పెల్ హాల్ సమీపంలో, శారదా నగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, ఆర్టీసీ బస్టాండ్ రాజహంస సమీపంలో తదితర ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో సెల్లార్‌తో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి.
- కమలానగర్, విద్యుత్ నగర్, సుభాష్ రోడ్డు, కోర్టు రోడ్డు, తదితర ప్రాంతాల్లో అనధికారికంగా లాలీపప్స్, క్యాండీలివర్స్ తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇలా అనధికార నిర్మాణాలతో నగరం అస్తవ్యస్తంగా మారుతోంది. ఎటువంటి ప్లానింగ్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా.. ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు.



ఒక్కరే దిక్కు..

వాస్తవంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి రెండు ఏసీపీ పోస్టులు, నలుగురు టీపీఎస్, ఆరు మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు కలుపుకుని మొత్తం 16 మంది ఉండాలి. కానీ ఇక్కడ కేవలం టీపీఓ మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆమెకే సర్వాధికారాలు ఉన్నాయి. ఏసీపీ, టీపీఓ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, టీపీఎస్ ఆమెనే. ఇక వివిధ సచివాలయాల పరిధిలో ఉన్న పట్టణ ప్రణాళిక అధికారులు కేవలం నోటీసులిచ్చేందుకు తప్ప వారు చేసేదేమీ లేదు. వారు గుట్టుచప్పుడు కాకుండా లైసెన్స్ ఇంజినీర్లు పని చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇదే అదునుగా తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ప్రతి డివిజన్‌లో అనధికార నిర్మాణాలకు అనుమతులు ఇప్పిస్తామంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిస్తున్నాయి. అందులో భాగంగానే నగరపాలక సంస్థలోని కీలక టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులను నియమించేందుకు ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు. అనధికార నిర్మాణాలతో పాటు కోర్టు కేసులు, అడ్వటైజ్‌మెంట్ పన్ను, నగరపాలక సంస్థకు చార్జ్‌షీట్లు వేసిన వాటికి వేసిన అపరాధ రుసుం తదితర వాటికి పట్టించుకునే నాథులు కరువయ్యారు. వీటిని వసూలు చేస్తే నగరపాలక సంస్థ రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం లేకపోలేదు. తెలుగు తమ్ముళ్లు నగరాభివృద్ధిని పక్కన పెట్టి వారి వ్యక్తిగత ఆదాయంపై ప్రత్యేక దృష్టిసారించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాలకవర్గంతో మాట్లాడితే ఇంటికే..

నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ టీపీఎస్ పాలకవర్గానికి అనుకూలంగా ఉన్నారన్న కారణాన్ని చూపి ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దారుణమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ జోక్యం చేసుకుని కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

జయరాం.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: 'గుమ్మనూరు జయరాం.. నీవు బెదిరిస్తే బెదిరేవాళ్లు ఎవరూ లేరు' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆలమూరు సీపీ ఓబిలేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వారిని పోటీ చేయకుండా చేస్తానంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కర్నూలు జిల్లాలో నీతోలు తీస్తే చంద్రబాబు కాళ్లు పట్టుకుని గుంతకల్లుకు వచ్చావని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నీకు చుక్కలు చూపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తామన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోవాలన్నారు. నీ ఆటలు ఇక సాగవని.. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. నీ అరచాకాలను ప్రజలు గమనిస్తున్నారని.. త్వరలో వాళ్లే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడియంపేట ఆంజనేయులు, మల్లెపోగుల నగేష్, గుజ్జల నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోండి



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో కురుబ సంఘం నాయకులు

ఆత్మకూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కురుబ సంఘం నాయకులు సూచించారు. ఆదివారం స్థానిక కనకదాస కల్యాణ మండపంలో శ్రీ కనకదాస మారెప్ప విద్యాధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. 30 మంది విద్యార్థులకు రూ.65 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కురుబలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరి ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు సుబ్బర బేల్దారి హనుమంతు, నీలకంఠ, మారెన్న , నారాయణప్ప, శివయ్య, సిమెంట్ పోలన్న, కిష్టప్ప, ఈశ్వరయ్య, రాజశేఖర్, పెదయ్య, శీనప్ప, అక్కులన్న, రామాంజనేయులు, ఓబుళపతి, బ్రహ్మయ్య, ధనంజి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: నగరంలోని రెవెన్యూ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళ, ఒక విటుడిని అరెస్ట్ చేసినట్లు మూడో పట్టణ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

నగరంలోని శాంతినగర్‌లో బోర్డులో నివాసం ఉంటున్న యనుమల ప్రసాద్ అనే విద్యార్థిని ఆదివారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. ఒకటో రోడ్డులోని శారదా స్కూల్‌లో చదివిన యనుమల ప్రసాద్.. పదో తరగతిలో ఫెయిల్ అయ్యాడు. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. మూడో పటణ పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం బాలుడి ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



షాలిని (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఆదర్శ నగర్‌కు చెందిన ఓ వివాహిత రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం నగరానికి చెందిన నవీన్ బాబుకు శెట్టూరు మండలం ములకలేడు గ్రామానికి చెందిన షాలిని (23)కి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. నవీన్ బాబు డీమార్ట్‌లో పని చేస్తున్నాడు. వీరిద్దరూ ఆదర్శ నగర్‌లో నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భర్త డ్యూటీకి వెళ్లిన సమయంలో భార్య ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. ఇంటికొచ్చిన నవీన్ బాబు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదు. షాలిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మీ రెడ్ బుక్ చిరిగిపోతుంది'



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ శ్రేణులు సరెండర్ కావాలని లేకపోతే రెడ్ బుక్ తెరుస్తానంటూ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వ్యాఖ్యలు చేయడంపై మేయర్ వసీం ధ్వజమెత్తారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మొదట మీ రెడ్‌బుక్ చిరిగిపోతుంది.. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జయరాంను హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ఇంత దిగుజారుడు, బెదిరింపులకు దిగితే ఎలా అని ప్రశ్నించారు. మీరు బెదిరిస్తే ఇక్కడెవరూ భయపడే పరిస్థితి లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ఎమ్మెల్యే జయరాం మాట్లాడారని.. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి మరీ దారుణంగా మాట్లాడారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. అసలు కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందించేందుకు వచ్చిందా? లేక వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని పాలన సాగించాలని చూస్తోందో అర్థం కావడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక సీఎం చంద్రబాబు అండ్ కో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే బీహార్ వాతావరణం తలపిస్తోందన్నారు. రెడ్‌బుక్ పేరుతో ఇటువంటి దారుణాలకు పాల్పడుతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, రహంతుల్లా, కమల్ భూషణ్, ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: చదువుతోనే రజక విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఎక్కలూరు రంగనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ చంద్రశేఖర్, సురేష్, ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పి.కమ్మన్న, జిల్లా రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణ స్వామి తదితరులు మాట్లాడారు. అనాదిగా రజకులు వృత్తిపై ఆధారపడి జీవించారన్నారు. చక్కటి విద్యనభ్యసించడం, ఉన్నత ఉద్యోగాలను సంపాదించడం తర్వాతే సామాజిక గౌరవం దక్కిందన్నారు. ఈతరం విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం 10వ తరగతిలో ప్రతిభ కనపరచిన 19 మంది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సంపాదించిన మరో 13 మందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కృష్ణమూర్తి, డాక్టర్ ముత్యాలు, డాక్టర్ రామలింగమయ్య, సుధాకర బాబు, బయన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలో అడ్మిషన్లు ఇవ్వాలి



డీసీఓతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ప్రవేశాల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తెలిపారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓను కలిసిన సాకే హరి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అడ్మిషన్లు కేటాయించాలని కోరారు. వందల కిలోమీటర్లు దూరం పోవాలంటే సాధ్యం కాదన్నారు. ఎప్పుడూ లేనివిధంగా నెల్లూరు, కడప, చిత్తూరు లాంటి దూర ప్రాంతాలకు పిల్లలను కేటాయిస్తున్నారన్నారు. ఇది సరికాదన్నారు. ఆయా జిల్లాల్లోనే అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు. గురుకులాల్లో సీటు వచ్చిందన్న సంతోషం విద్యార్థుల్లో తల్లిదండ్రుల్లో నీరుగారిపోయిందన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి విద్యార్థికి సీట్లు వచ్చేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రభాకర్, మాల మహానాడు శ్రీనివాసులు, సమతా సైనిక్ దళ్ రమేష్ పాల్గొన్నారు.

కార్యాలయాల వద్ద అపరిశుభ్రత

ఆత్మకూరు మండలం పి.యాలేరు సచివాలయం పక్కన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వద్ద అపరిశుభ్రత నెలకొంది. కార్యాలయాల బయట ముళ్ల కంపలు పెరిగాయి. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో విషపురుగులు సంచరించే ప్రమాదం ఉంది. సేవల కోసం కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల బయట ఉన్న ముళ్ల చెట్లు, చెత్తా చెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – ఆత్మకూరు:



రైతు సేవా కేంద్రం బయట పెరిగిన ముళ్ల కంపలు

విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఇలా..

వైద్య విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

అనంతపురం మెడికల్: 'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోంది. వైద్య కళాశాలలను 66 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే విధానాన్ని తక్షణం రద్దు చేయాలి' అని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైద్య విద్య చదువుకోవడానికి అడ్డుగా ఉన్న 107, 108 జీఓలను తక్షణం రద్దు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 1,800 మెడికల్ సీట్లు వచ్చేవని.. అయితే సీట్లను రద్దు చేయాలంటూ కూటమి ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. ఇంతకన్నా దారుణం మరెక్కడా ఉండదన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

సంతల ఆదాయం రూ.3.82 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.82 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. ఇందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,41,990 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,40,500 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ సమావేశాన్ని విజయవంతం చేయండి

అనంతపురం కార్పొరేషన్: పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జరగనుంది. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ విభాగానికి చెంది నాయకులందరూ హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

త్యాగరాజ సంగీత సభ అధ్యక్షుడిగా బుగ్గయ్య



అనంతపురం కల్చరల్: శాస్త్రీయ నృత్యం, సంగీతానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా త్యాగరాజ సంగీత సభ కృషి సాగించాలని సభ వ్యవస్థాపకుడు జ్ఞానేశ్వర రావు ఉత్తార్కర్ సూచించారు. ఆదివారం త్యాగరాజ సంగీత సభ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బుగ్గయ్య చౌదరి, ఉపాధ్యక్షులుగా జ్వాలాపురం శ్రీకాంత్, కేసీ కృష్ణ, నామసేవ హరికృష్ణ, కార్యదర్శిగా లక్ష్మీదేవి, సంయుక్త కార్యదర్శులుగా ప్రభావతి, శ్రీవల్లి, సహాయ కార్యదర్శిగా పద్మజ, జెమినీ బాబుతో పాటూ మరో 12 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సభ ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ కళాకారులకు అతిథ్యమిచ్చిన త్యాగరాజ సంగీత సభ అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చే నెల సంగీత దిగ్గజం మంగళంపల్లి బాల మురళీకృష్ణ జయంతి వేడుకలతో కొనసాగిస్తామని తెలిపారు. ఔత్సాహిక గాయనీ గాయకులు, నృత్యకళాకారులకు అవకాశాలను కల్పించాలని తీర్మానించారు. ఆడుకుందాం.. పాడుకుందాం కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

సన్మాన సభ జయప్రదం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: ఆగస్టు 3వ తేదీన ఆర్‌పీఎస్, ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో జరిగే బహుజన ఆత్మీయ సన్మాన సభను జయప్రదం చేయాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమన్నారు. బీసీలకు చట్టసభల్లో, ఉద్యోగాలు, విద్యలోను 44 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బహుజన ఆత్మీయ సన్మాన సభకు అందరూ రావాలని కోరారు. కార్యక్రమంలో శేష పాణి, పుల్లయ్య, శివ కృష్ణ, నారాయణ నాయక్, నాగభూషణం, రాజా రమేష్, సాకే హరి, చింతన్న, శ్రీరాములు, పామన్న, ఉమాశంకర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, ఓబులేసు, కిష్ట, బాబా పకృద్దీన్, రమేష్ యాదవ్, భార్గవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.